కథ

# తోచని సడి

దాట్ల దేవదానం రాజు




గడియారంలోని ముళ్లకోణాల ఆధారంగా టైం తెలుసుకున్నాను. దండెంమీద ఆరేసిన ముడతల గడియారం అది.

నాలో ఉద్వేగం. అనేకానేక భావసంచలనాల సడి కుదిపేస్తోంది.

ఇంకా గంట ఉంది. నాలో కంపనాలు మొదలయ్యాయి. పదకొండు నలభై అయిదు కోసం ఎదురుచూడాలి.

నార్మన్ విన్సెంట్ పీలే పవరు ఆఫ్ పోజిటివ్ థింకింగు తిప్పుదామని తీశాను.

ఇంతట్లో రిమోట్‌తోగాని తగ్గించలేని రొద...

ఇంట్లో ఛానల్ మార్చడమే కష్టం. సౌండ్ తగ్గించడం పర్వాలేదు.

హాలులోకి వెళ్లి చప్పుళ్ల పీక నొక్కాను.

గదిలోకొచ్చి కిటికీ దగ్గరకు నడిచాను. కిటికీ తలుపు తెరచి రోడ్డువార జోళ్లుకుట్టే వాడికేసి చూశాను. వేలికి గుచ్చుకున్న సూది... బాధ ఓర్చుకుంటున్నాడు, పళ్ల బిగువున.

కిటికీ తలుపు మూసి మంచం మీద కూర్చున్నాను.

ఎంతకీ నిమిషాల ముళ్లు కదలి కదలి గంట అవ్వదేం? బ్యాటరీ సెల్ వీక్ అయినట్లు కాలం నెమ్మదిగా కదులుతుందా?

గోడమీద సాయంసంధ్య చిత్రం. నది అలజడిగా ఉంది. నురుగులు ఒడ్డుకు కొట్టుకొస్తున్నాయి... తీరాన రాటకు కట్టిన నావ... దూరంగా తెల్లగా ఎగురుతున్న పక్షులు... మేఘాలు... నీటిమీద వాటి నీడ... ఎరువు పులుముకున్న వాతావరణం... రోజూ చూస్తున్నా ఎప్పటికప్పుడు వింత అనుభూతి.

మరో గోడమీద పర్వతాలు... లోయలు... పసిడి పువ్వుల మొక్కలు... నేను మంచి గొర్రెల కాపరిని. నా గొర్రె నాకు తెలుసు... ఇంగ్లీషు అక్షరాలు.

పైన తిరుగుతున్న ఫ్యాను. ఇలా పడుకుని ఉండగానే ఎపుడో ఊడిపడిపోతుందన్న ఫీలింగు... అలవాటైన చప్పుడు...

ఈవేళ రాజ్‌కుమార్ చెప్పిన సమయానికి తప్పక మాట్లాడాలి. పావుతక్కువ పండెండు గంటలకు మాట్లాడమన్నాడు. నేను ఇస్తానన్న డబ్బుకి పని జరుగుతుందో లేదో చెబుతానన్నాడు.

పని అవుతుందో లేదో ఈవేళ తేలిపోవాలి. కొంచెం గౌరవంగా నెమ్మదిగా ప్రాధేయపడాల్సిన మాటలు చెప్పాలి. అవతలి మాటల్ని శ్రద్ధగా వింటూ వినమ్రత చూపాలి.

టైమెంతయ్యిందో?

చచ్చీచెడి అరగంట కూడా కాలేదు. ఇంకా ఒక అరగంటను ఈడ్వాలి.

ఒకటే టెన్షన్ పెరిగిపోతూంది.

ముందు టెన్షన్ తగ్గాలి. ఆలోచనల్ని పక్కదారి పట్టిస్తే మాట్లాడాల్సిన విషయం రిహార్సల్ దెబ్బతింటుందేమో...! గొంతు సవరించుకున్నాను, మైకు ముందు మాట్లాడేవాడిలా. వంటగదిలోకెళ్లి మంచినీళ్లు తాగాను.

తిరిగొచ్చి తలుపులు బిగించాను.

రాజ్‌కుమార్ తనే చేస్తాడేమో? వాడి దగ్గర నా ఫోన్ నంబరుంది.

వాడెందుకు చేస్తాడు? అవసరం నాది. నిజంగా కనుక అతనే ఫోన్ చేస్తే నేనేం మాట్లాడాలో అనుకోలేదు కూడా. ఖచ్చితంగా అతను చేయడుగాక చేయడు.

గదిలో ఫ్యాన్ హోరు... కరకరమని మింగుతానంటుంది.

అంతర్లీనంగా నలుగుతున్న ఆలోచనలు మూగగా... చేతిలో పుస్తకాన్ని గది మూలకు విసిరేసాను.

బీరువా తాళం తీసి నోట్ల కట్టలు బయటకు తీశాను. ఒకసారి అరచేతిలో తూకం వేసుకుంటూ "ఇవన్నీ వాడికిచ్చేయాలి. అయినా ఒప్పుకుంటాడో లేదో ఒప్పుకుంటే బాగుండును. ఇంతకంటే ఇక ఇవ్వలేను."

ఖరీదు పెట్టకుండా ఏదైనా ఎలా వస్తుంది?

భయంభయంగానో అవసరంగానో ఏదైనా కొనాల్సిందే. గుట్టుచప్పుడు కాకుండా కొనే సరుకులూ ఉంటాయి.

గదంతా చిందరవందరగా ఉంది. ఇలాగా ఉండటమే నాకిష్టం. సర్దితే మనుషులు మసలుతున్నట్లు అనిపించదు. ఎక్కడబడితే అక్కడ పేజీలు ఎగురుతుండాలి.

పేజీలు పిలుస్తున్నట్లుంటేనే గమ్మున ఆ పుస్తకం చదవాలనిపిస్తుంది. నీటుగా సర్దిన పుస్తకాలు ఇక చదవడమెందుకు?

ఒక ఫలానా టైం కోసం ఎదురుచూడ్డం ఒకరకంగా శిక్షే.

ఇరవై నిమిషాలుంది.

ఫోన్ దగ్గరకు కుర్చీ జరిపాను. ఫోన్‌మీద కప్పిన అల్లిక గుడ్డ తీసేశాను.

కుర్చీమీద కూర్చుని ఊపిరి పీల్చాను. ఫోన్ ముట్టుకుని రిలాక్స్‌గా కుర్చీలో వెనక్కి వాలి... కాలింగ్ బెల్ మోత.

"ఇప్పుడెవరొచ్చారో... నన్ను చంపుకు తినడానికి." ఉస్సురని లేచాను.

బయటకు రాగానే చందాల పుస్తకం ముఖం ముందుకు పెట్టాడు. రక్తదానలు చేసేవాడట. రోజూ ఆస్పత్రిలో రక్తం దానం చేస్తాడట. తెల్లగా పాలిపోయి ఉన్నాడు. వాడి పుష్టికరమైన ఆహారానికి చందా కావాలట. అంతా నాటకం. పొట్టకూటికి కొత్తగా చేరిన వృత్తి భాగోతం.

తెలుసున్నవాడిలా స్నేహంగా నవ్వుతున్నాడు.

"ఇలా అడుక్కోవడానికి పోలీస్‌స్టేషన్‌లో పర్మిషన్ తీసుకున్నావా? ఏదీ కాగితం?"

బిక్కమొహం వేసాడు వెర్రిపీనుగ.

"పోరా... పో..." ఒక్కుదుటున తలుపులు మూసి లోపలికొచ్చేసాను.

రాజ్‌కుమార్ పేరులో హుందాతనం ఉంది. జీన్ ఫాంట్... టీ షర్ట్... బెల్ట్... దానికి సెల్ ఫోన్... స్టైల్‌గా... సెల్ నంబరు లేదు నాదగ్గర.

అతను ఇప్పుడు అక్కడే నంబరు దగ్గర ఉంటాడా? చెప్పిన టైంకు దొరుకుతాడా?

"అవతల తీవ్రవాదంతో ప్రపంచం మండిపోతోంది."

"ఒక దేశంలో రెండు బిల్డింగులు కూలిపోతే... లోకానికి వచ్చే తిప్పలు అన్నీ ఇన్నీనా?"

"పాకిస్తాన్‌వాడికి ఈసారి బాగా అవుతుంది... ఆహహా..."

"కొడుకుని చంపిన తండ్రి... తాగొచ్చిన కొడుకు దౌర్జన్యం భరించలేక... ప్చ్... పాపం..."

"వాకింగ్ చేస్తూ గుండెపోటుతో... హరీ..."

"ఫైనాన్స్ కంపెనీల చీటింగు... డిపాజిట్‌దారుల గగ్గోలు"

ఏమిటివాళ్ల బుర్రంతా యమ కంగాళీగా ఉందీ... టైం చూడాలి.

ఇంక ఎంతో లేదు. పది నిమిషాలే.

ఒంటిమీద చొక్కా విప్పాను. అద్దం దగ్గరకెళ్లి తల దువ్వుకున్నాను. పౌడరు రాసుకుని అద్దంలో చూసుకున్నాను. అచ్చం రాజ్‌కుమార్‌లా కనిపించాను. వారగా నిలబడి ఫోజులిచ్చాను.

అంతలోనే సన్నగా వణుకు.

నిలదొక్కుకుని నిటారుగా నిలబడ్డాను.

ఉద్రిక్తతల్ని, ఉక్రోషాల్ని కట్టడి చెయ్యడం కష్టమే. ఒక్క పెగ్గన్నా వెయ్యాల్సిందేమో. ఇప్పుడేలా?

ఫోన్ దగ్గరకెళ్లాలి. ఆచితూచి జాగ్రత్తగా మాట్లాడాలి. గౌరవభావం ఉట్టిపడేలా ప్రవర్తించాలి.

నా ఉనికి గజిబిజిగా ఉంది. జుట్టు పీక్కుని బుగ్గ గిల్లుకుంటే గాలిలో పడొచ్చేమో.

జుట్టు పీక్కుని బుగ్గ గిల్లుకున్నాను. సన్నగా నవ్వు తెరలుతెరలుగా వస్తున్నది.

ఈవేళ ఏదో తేలిపోతే నిశ్చింత.

లుంగీ సర్దుకున్నాను. ఈ ఆదుర్దాని మరేదైనా భాషలో సముదాయించుకుంటే బావుంటుందేమో.

ఇంకా అయిదు నిమిషాల టైముంది.


కుర్చీలో కూలబడ్డాను. ఇప్పుడేం జరిగినా నేరం నాదికాదు. అలా అని ముందు రాసేసుకుంటే?

స్థిమితపడ్డం చాలా కష్టంగా ఉంది. ఇట్లాంటి సందర్భాల్లో ఎవరైనా ఏం చేస్తారో దాఖలాలు నాదగ్గర లేవు.

కరెంటు పోయింది. ఎప్పటిలాగే. ఫోన్ రాలేదు. రాజ్‌కుమార్ చేయడు.

రాజ్‌కుమార్ ఎందుకు చేస్తాడు? పని నాది గనుక నేనే చెయ్యాలి.

టింగ్... టింగ్... టింగ్...



ఫోన్ మోగుతూంది. రాజ్‌కుమార్ చేస్తున్నాడా? అంత అదృష్టమా?

ఆందోళనగా ఫోన్ ఎత్తాను.

"రాజేష్ జ్యూయాలర్స్ షాపాండీ" సన్నని గొంతు అడుగుతుంది.

ఒక అంకె తేడాలో నెంబర్లుంటే పక్కవక్క ఇళ్లల్లో ఉంటున్నట్లు...

ఎప్పటిలాగే రాంగ్ నంబరు. గట్టిగా అరిచాను. స్పృహ తప్పేలా ఉంది. ఒళ్లంతా చెమటలు పట్టేస్తున్నాయి.

కరంటు వచ్చింది. కాంతి భరించలేకపోతున్నాను. ఇలా కాదు అనుకుంటూ ఫ్యాన్ కట్టేసి లైట్ ఆర్పేశాను. ఇక నేనే రాజ్‌కుమార్‌తో మాట్లాడాలి. ఎలాగా?

ఈ చెమటలో... ఈ చీకటిలో... వేడిగా... జిడ్డుగా... మృదువుగా... మార్దవంగా... స్నేహంగా... ఎంతో ప్రేమగా పిలవాలి రాజ్‌కుమార్‌ని.

రాజ్‌కుమార్ అక్కడుంటాడా?

కొంచెం కాఫీ తాగింతర్వాత ఫోన్ చేస్తేనో...?

ఇప్పుడు కాఫీ ఎవరిస్తారు, అసందర్భంగా.

పదకొండు ఏభై నిమిషాలు....

రాజ్‌కుమార్‌తో మాట్లాడటానికి ఇంకా ఎంతసేపు వేచి చూడాలి?

'నా బుర్రని శుభ్రంగా కడుక్కుని నింపాదిగా హాయిగా స్వచ్ఛంగా ఆలోచనల్ని ఒకదారిలోకి తెచ్చుకుని...' నాలోంచి ఉబికివస్తున్న ఏడుపుని ఆపుకుంటూ.

బయట ఏడుపుల రొద వినిపించింది, ఒక్కసారిగా.

ఇంటి ఎదురుగా శవాన్ని పెట్టుకుని ఎదురుచూస్తున్నారు.

రాని కొడుకు కోసం.

కొడుకొచ్చినట్లున్నాడు. సంఘం కోసం కాసేపు నటనలు మొదలవుతాయి. ఆ తర్వాతే శవాన్ని తీసుకెళతారు.

వీధిలోకెళితే మొత్తం మూడ్ దెబ్బ తింటుంది.

ఏమైనా అనుకోనీ... వెళ్లను గాక వెళ్లను. అనవసరమైన వేషాలేస్తున్నానా?

లేదు. ఇక నంబరు కొట్టాలి.

నాకు బాగా తెలుసున్న నంబర్. అయినా డైరీ చూడాలి. అవునూ, డైరీ ఏదీ?

లైటు వేశాను.

డైరీ వెతికి తెచ్చి నంబరు గల పేజీని ఒకచేత్తో అదిమి పట్టుకుని రెండో చేత్తో ఫోన్ క్రెడిల్ చెవికి ఆనించుకుని భుజంతో బేలన్స్ చేసుకుని నొక్కుకుంటూ... చేతిని నెమ్మదిగా కిందికి విడిచి...

వేలితో ఒక్కో నంబరునీ...

అంత గట్టిగా అంకెల్ని నొక్కుతారేంటి, అసహ్యంగా అంటాడు మావాడు.

నేనెప్పుడూ పట్టించుకోలేదు. ఇప్పుడు మాత్రం అతిసుతారంగా నొక్కుతున్నాడు. రాజ్‌కుమార్‌కు అసలు దెబ్బ తగలకూడదు.

రింగవుతూంది. రాజ్‌కుమార్ నా ఎదురుగా కూర్చున్నట్లు ఫీలవుతున్నాను.

కొంచెం ముందుకు వినయంగా వంగాను. ముఖంలోకి చిరునవ్వు తెచ్చుకున్నాను.

చెమటతో తడిసి ముద్దవతూ... చెవిలో రహస్యం చెప్పేవాడిలా ఊపిరి బిగపెట్టుకుంటూ...

కాస్త ఊపిరి పీల్చుకున్నాను. డాక్టర్ బి.పి. నియంత్రణ కిచ్చిన మాత్రలు ఎప్పుడూ మర్చిపోను. రక్తం వేగంగా శరీరంలో పరుగెడుతూంది.

క్షణాక్షణం అవతలి వైపు ఫోన్ ఎత్తిన క్లిక్‌మనే చప్పుడుకు ఎదురుచూపు.

రింగు ఆగిపోయింది. ఫోన్ పెట్టేశాను.

అమ్మయ్య అనుకున్నాను, ఎందుకో.

వెనుకగా వెచ్చని ఊపిరి... ఎవరో ఏదో చెబుతున్నట్లు... వెనక్కి తిరిగాను.

ముళ్లకంచెతో బాదినట్లు... ముఖం నిండా పేడ పులుముకుని... గజ్జికుక్క ఏడుపులాంటి నవ్వుతో... ఎవరైనా కనబడతారేమోనని చూశాను. ఎవరూ లేరు.

'అంతా భ్రాంతియేనా జీవితాన...'

రాజ్‌కుమార్ నంబరు మళ్లీ నొక్కాను, అతి జాగ్రత్తగా.

రాజ్‌కుమార్ చాలా మంచివాడు. చాలా అందంగా మాట్లాడతాడు. కలుపుగోలుగా ఉంటాడు. స్పష్టంగా తను చెప్పాల్సింది చెబుతాడు. అహం మచ్చుకి కనబడదు.

రాజ్‌కుమార్‌ని తప్పు పట్టలేను. రాజ్‌కుమార్‌లు సమాజంలో అంచెలంచెలుగా ఎదుగుతారు. వ్యవస్థలోని చట్టాల్ని బహునేర్పుగా తమకు అనుకూలంగా మార్చుకుంటారు. డబ్బులు సంపాదిస్తారు. అదృష్టం అంతా రాజ్‌కుమార్‌దే.

మరల రింగవుతుంది. అక్కడెవరూ ఉన్నట్లు లేదు. రాజ్‌కుమార్‌కు ఏదైనా ప్రమాదం జరిగిందా?

ఎముకలు విరిగి... కట్టులతో... రక్తసిక్తంగా... ఆస్పత్రి పాలయ్యి... హృదయవిదారకంగా...

నో... నో... అలా జరగకూడదు.

చలాకీ రాజ్‌కుమార్ నవ్వుతూనే ఉండాలి.

నాపని తప్పకుండా రాజ్‌కుమార్ చేస్తాడు. మంచివాడైన రాజ్‌కుమార్ మాటతప్పడు. బేరాన్ని ఎవరైనా తన్నుకుపోతారేమో... భయం నాకుండక్కర్లేదు.

'రాజ్‌కుమార్‌తో ఈవేళ ఇంక మాట్లాడలేను' విచారంగా అనుకున్నాను.

కరెంటు మళ్లీ మళ్లీ పోతున్న ఆనవాళ్లు ఎవరూ చెరపలేదు. చీకటి వెలుగుల ఆటలు ఎవరూ తప్పించుకోలేరు.

మా వాడికి ఉద్యోగం చాలా అవసరం. అది రాజ్‌కుమార్ చేతిలో ఉంది. నా శక్తికి మించి పోగుచేసిన డబ్బులు వాడి మొఖాన్న కొట్టాలి... సారీ....

ఎప్పటికైనా, అటునుంచి రాజ్‌కుమార్ మాట్లాడితే బాగుండును.

అతను మాట్లాడడు.

నేనే మాట్లాడాలి, ఎప్పటికైనా. ■

